మంచంపట్టిన పెద్దవరం



దర్శి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు





జ్వరాలతో మంచంపట్టిన పెద్దవరం ప్రజలు

- చోద్యం చూస్తున్న వైద్యారోగ్యశాఖ

కురిచేడు: ఒకవైపు మండుతున్న ఎండలు.. మరో వైపు అడపాదడపా కురుస్తున్న వర్షాలకు వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రజలు అనారోగ్యం బారిన పడి మంచంపడుతున్నారు. కురిచేడు మండలంలోని పెద్దవరం గ్రామంలో ప్రతి ఇంటికి ఇద్దరుముగ్గురు మంచంపట్టారు. మండలంలో ఒకే ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా, వైద్యసిబ్బంది పట్టించుకోకుండా చోద్యం చూస్తుండటంతో ప్రజలు వ్యాధులతో అవస్థపడుతున్నారు. గత వైఎస్సార్‌ సీపీ హయాంలో ప్రతి సచివాలయానికి ఒక సీనియర్‌ నర్సు ఉండటంతో పాటు ప్రతి సీజనులో ఇంటింటికి వలంటీర్లతో సర్వే చేయించి జ్వరపీడితులను గుర్తించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించే వారు. కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 17 నెలలైనా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలు ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటూ డబ్బులు ఖర్చుచేసుకుంటున్నారు. జ్వరం ఎక్కువగా ఉన్న వారు వినుకొండ, నరసరావుపేట, గుంటూరు, దర్శి తదితర ప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చుచేసుకుని వైద్యం చేయించుకుంటున్నారు. పేదలు మాత్రం ఖర్చుకు భయపడి స్థానికంగా ఆర్‌ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రికే పరిమితమై వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోవటం, క్షేత్రస్థాయిలోని సిబ్బంది కూడా సరైన సమాచారం ఉన్నతాధికారులకు అందించకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు స్పందించి పెద్దవరం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వరాలు అదుపులోకి వచ్చేంత వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

దర్శిలో విజృంభిస్తున్న విషజ్వరాలు

దర్శి: పట్టణంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సీహెచ్‌సీకి వచ్చిపోయే రోగులకు ఎడతెరిపి లేకుండా పోయింది. వార్డులో ఏ మంచంలో చూసినా పేషెంట్లే దర్శనమిస్తున్నారు. వారికి వసతులు మాత్రం కరువయ్యాయి. ఆస్పత్రిలో ఒక పూట పెడితే మరో పూట భోజనం పెట్టకుండా ఎగ్గొడుతుండటంతో రోగులు బయటకు వెళ్లి ఆహారం తెచ్చుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాలంటే తలకు మించిన భారం పడుతోందని ప్రభుత్వాస్పత్రులకు వస్తే ఇక్కడ పట్టించుకునే వారే కరువవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. వచ్చిన వారిని నర్సులే చూసి పంపుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం రోగులకు భోజనం అందించారేగానీ.. సాయంత్రం మాత్రం భోజనం ఇవ్వలేదు. దీంతో రోగులు బయటకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి దయనీయంగా తయారైందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు సాయంత్రం అన్నం ఎందుకు పెట్టరని విలేకరుల ఎదుటే నర్సులను రోగుల బంధువులు నిలదీయడం గమనార్హం. దీంతో వార్డులోకి వెళ్లి అడగ్గా పేషెంట్లందరూ తమకు సాయంత్రం ఆహారం ఇవ్వలేదని తెలిపారు.

కేజీబీవీ ప్రాంగణంలో పడకేసిన పారిశుధ్యం



పెద్దారవీడు కేజీబీవీ ప్రహరీ దగ్గర నిల్వ ఉన్న మురుగు నీరు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రహరీ వెనకాల మురుగు నీరు అక్కడే నిలిచిపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గోడ వెంట పెద్ద గుంత ఉండటంతో వృథా నీరు బయటికి పోయే అవకాశం లేక మురుగు నీరు అక్కడే నిల్వ ఉంది. విద్యాలయం నుంచి వృథా నీరుతో పాటు భోజనానికి ఉపయోగించిన తర్వాత ఉన్న వ్యర్థ పదార్థాలను అక్కడే వేయడంతో నిల్వ ఉన్న మురుగుపై ఈగలు, దోమలు వాలి స్వైర విహారం చేస్తున్నాయి. పక్కనే బాలికలు భోజనాలు చేసే హాలు ఉంది. భోజనం తినే సమయంలో భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని బాలికలు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. విద్యాలయం పక్కనే పొలాలకు వెళ్లే రహదారి కావడంతో రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అటు వైపు వెళ్లే వారు దుర్వాసన వెదజల్లటంతో ముక్కు మూసుకొని వెళ్తున్నారు. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యాలయం ప్రాంగణంలో కాలువలు నిర్మించి మురుగు నీరు చివరి వరకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా షహనాజ్‌బేగం



షహనాజ్‌బేగం

తాళ్లూరు: స్థానిక మండల ప్రజా పరిషత్‌ కార్యాలయ డిప్యూటీ ఎంపీడీవోగా షేక్‌ షహనాజ్‌బేగంకి అదనపు బాధ్యతలు అప్పగించారు. కొంతకాలంగా మండలంలోని విఠలాపురం, తాళ్లూరు-1, శివరాంపురం సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శిగా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన డిప్యూటీ ఎంపీడీవో దారా హనుమంతరావు వర్క్‌ అడ్జస్ట్‌మెంట్‌పై పుల్లలచెరువు మండలానికి వెళ్లారు.

చంద్రబాబుకు వెన్నుపోటు అలవాటే..

- పోలవరంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకుల ధ్వజం



పోలవరంలో చంద్రబాబు మోసపూరిత హామీలపై క్యూఆర్‌ కోడ్‌ ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

ముండ్లమూరు (దర్శి): చంద్రబాబుకు వెన్నుపోటు అలవాటేనని వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ చింతా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్‌ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ముండ్లమూరు మండలం పోలవరం గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్‌ చింతా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేశారు. సూపర్‌సిక్స్‌ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి, సునీతా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ అప్పుడు చేరదీసిన మామకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు.. ప్రజలకు అమలు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. బాబు జీవితం మొత్తం వెన్నుపోటుమయమే అని అన్నారు. రైతులకు యూరియా లేక అల్లాడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని అన్నారు. బ్లాక్‌ మార్కెట్‌లో ఎంతైనా యూరియా దొరుకుతుందిగానీ ప్రభుత్వ ధరకు మాత్రం దొరకకపోవడం కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు నిదర్శనమని అన్నారు. రైతులను అన్ని విధాలుగా మోసం చేసిన ఘనుడు చంద్రబాబేనన్నారు. పండించిన ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, రైతు సంఘ అధ్యక్షుడు బంకా నాగిరెడ్డి, ముండ్లమూరు మండలం ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ ముతికేపల్లి గురువారెడ్డి, మండల దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు సన్నపురెడ్డి వెంగళరెడ్డి, ముతికేపల్లి కోటిరెడ్డి, ముదిగేపల్లి కృష్ణారెడ్డి, పాపిరెడ్డి, మిట్ట శ్రీనివాస్‌రెడ్డి, ముతికేపల్లి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోసం చేసి కూటమి నేతల సంబరాలు

- వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ యన్నాబత్తుల వెంకటసుబ్బయ్య



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

కురిచేడు: రాష్ట్ర ప్రజలకు ఎన్నికల హామీలైన సూపర్‌ సిక్స్‌ పథకాలు అందించకుండా మోసం చేసిన కూటమి ప్రభుత్వం.. ఏదో సాధించినట్లు సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ యన్నాబత్తుల వెంకటసుబ్బయ్య ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్‌ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం కురిచేడు మండలం దేకనకొండ గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ కురిచేడు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సూపర్‌ సిక్స్‌లో చెప్పిన ఉచిత గ్యాస్‌ పథకంలో మహిళలకు సంవత్సరానికి మూడు సిలిండర్లకు బదులు సంవత్సరం తిరిగే సరికి ఒక సిలిండర్‌కు మాత్రమే సబ్సిడీ డబ్బులిస్తున్నారని తెలిపారు. ఆడబిడ్డ నిధి ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఎక్కడ బాబూ అని నిలదీశారు. కూటమి సర్కార్‌ ఏర్పడి 17 నెలలు దాటినప్పటికీ గ్రామాల్లో పక్కా గృహ నిర్మాణాలు జరగలేదని విమర్శించారు. ఇంటింటికి తాగునీటి కుళాయిల ఏర్పాటు ఎక్కడి వరకు వచ్చిందన్నారు. పేదలను సంపన్నులను చేస్తామని చెప్పి.. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలను ధనవంతులను చేస్తున్నావంటూ సీఎం చంద్రబాబుపై విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పోతిరెడ్డి నాగిరెడ్డి, మండల బూత్‌ వింగ్‌ కన్వీనర్‌ కిలారి శరత్‌బాబు, సోమవరపు ఏసుబాబు, ఎంపీటీసీ సోమవరపు అంకారావు, యర్రగుంట్ల రోశయ్య, సోమవరపు చిన్న, అన్నెం పుల్లారెడ్డి, మార్తాల రమణారెడ్డి, పడిగపాటి చంటి, ఆరే వెంకటేశ్వర్లు, తాటిమట్ల పెద్దన్న, సిద్ధి వెంకటరెడ్డి, పులిమద్ది కోటయ్య, యర్రగుంట్ల మరియదాసు, బుజ్జి, లింగయ్య, ఆశీర్వాదం, సోమవరపు దేవదాసు, లింగయ్య, సోషల్‌ మీడియా కన్వీనర్‌ సంతోష్‌ కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఆటల పోటీలు

బేస్తవారిపేట: మండలంలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్లో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఏపీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎస్‌.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అండర్‌-14, అండర్‌-19 విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. 17వ తేదీన బాలబాలికలకు అథ్లెటిక్స్‌, 18 నుంచి 19వ తేదీ వరకు గేమ్స్‌ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గంగమ్మ తల్లికి పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

తాళ్లూరు: జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో కొలువై ఉన్న గుంటి గంగా భవానీ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారి మూలవిరాట్‌ను పూజారులు ప్రత్యేకంగా అలంకరించికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పుట్ట, నాగశిలలు, మల్లికార్జునస్వామి వారికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్‌ కె.గురుబ్రహ్మం, ఏఆర్‌కే ప్రసాద్‌, సిబ్బంది పర్యవేక్షించారు.

దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో వేనూతల కాటమరాజుస్వామి

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ వేనూతల కాటమరాజు స్వామి, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్‌ కొత్తపల్లి గ్రామం సమీపంలో వెలసిన శ్రీనాగాంజనేయస్వామి పుట్టకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాటమరాజుస్వామి, గంగ భవానీ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, నాగమయ్యపుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. ఆలయాల ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు నైవేద్యంగా పెట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.